



వేగంగా..

ధరణి దరఖాస్తులకు మోక్షం

- తహసీల్దార్, ఆర్డీవోలకు కొత్తగా లాగిన్‌లు
- స్పెషల్ డ్రైవ్‌లో వేగంగా క్లియరెన్సులు
- ఎప్పటికప్పుడు 'ఆన్‌లైన్'లో సమీక్షలు
- జిల్లాలో 19 వేల దరఖాస్తులకు 16,845 పరిష్కారం
- ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర సర్కారు

కేసముద్రం, జూన్ 12 : కొన్నాళ్లుగా వివాదాస్పదంగా ఉన్న భూముల సమస్యలపై సర్కారు దృష్టి సారించింది. చిక్కుముళ్లను వేగంగా పరిష్కరించేందుకు నడుం బిగించింది. భూములకు సంబంధించిన సమస్యలను ధరణి పోర్టల్ ద్వారా త్వరగా పరిష్కారానికి నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. స్పెషల్ డ్రైవ్‌తో యంత్రాంగాన్ని సిద్ధం చేసింది. భూముల రికార్డులను నిర్వహించే ధరణి పోర్టల్‌లో సమస్యల పరిష్కారానికి గతంలో జిల్లా కలెక్టర్‌కే అధికారాలు ఉండేవి. నూతనంగా ఆర్డీవో, తహసీల్దార్ స్థాయిలో పరిష్కారం అయ్యే సమస్యల కోసం వారికి కొత్తగా లాగిన్‌లు ఇచ్చారు. దీంతో మండల, డివిజన్ స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలు వేగంగా క్లియర్ అవుతున్నాయి.

గ్రీవెన్స్ ఆఫ్ ల్యాండ్ మ్యాటర్ (జీఎల్ఎం) దరఖాస్తులు, టీ-33లో వివిధ సవరణల కోసం చేసుకున్న దరఖాస్తులను స్పెషల్‌డ్రైవ్ ద్వారా పరిష్కరిస్తున్నారు. 'ఆన్‌లైన్'లోని ధరణి పోర్టల్‌లోనే దరఖాస్తులను పరిష్కరిస్తుండడంతో ఎప్పటికప్పుడు డ్యాష్‌బోర్డు ద్వారా మండల, డివిజన్, జిల్లాస్థాయిలో సమీక్షలను సంబంధిత ఉన్నతాధికారులు నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయి విచారణ నివేదికలు, కార్యాలయంలోని రెవెన్యూ రికార్డుల ఆధారంగా పరిష్కరించే సమస్యలను వెంటనే క్లియర్ చేస్తున్నారు.

గతంలో ప్రతీ దరఖాస్తు కలెక్టర్ స్థాయిలోనే..

ధరణి పోర్టల్‌లో వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉండడం, ప్రతీ దరఖాస్తు జిల్లా కలెక్టర్ స్థాయిలోనే పరిష్కారం చేయాల్సి ఉండడంతో అధికార వికేంద్రీకరణ చేపట్టారు. ఇందులో భాగంగా మండల, డివిజన్ స్థాయిలో పరిష్కారం అయ్యే సమస్యలకు తహసీల్దార్, ఆర్డీవోలకు అధికారాలను కట్టబెట్టారు. దీని కోసం తహసీల్దార్, ఆర్డీవోలకు కొత్తగా ధరణిలో లాగిన్ అవకాశం ఇచ్చారు. పట్టాదారు పాస్‌పుస్తకం లేకుండా నాలా కన్వర్షన్, ప్రభుత్వం సేకరించిన భూముల్లో సమస్యలు, ప్రవాస భారతీయులకు సంబంధించిన భూముల్లో సమస్యలతో పాటు కోర్టు కేసుల పరిష్కారం, మిస్సింగ్ సర్వేనెంబర్లు పరిష్కరించే అధికారాలను ఆర్డీవోలకు అప్పగించారు. పట్టా, అసైన్డ్ భూముల విరాసత్ (వారసత్వం), జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ) అనుమతులు, స్పెషల్ ల్యాండ్ మ్యాటర్స్, ఖాతాల విలీనం వంటి సమస్యలను పరిష్కరించే బాధ్యతలను తహసీల్దార్‌లకు అప్పగిస్తూ లాగిన్ ఇచ్చారు.

సమస్యల పరిష్కారం ఇలా..

తొలుత ధరణిలో అర్జీదారులు చేసుకున్న దరఖాస్తుల్లోని వివరాలన్నీ పరిశీలిస్తున్నారు. ఇందుకు అనుబంధంగా సేత్వార్, కాస్రా, పహణీ, ఇతర లింక్ డాక్యుమెంట్లు పరిశీలించి, క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరిస్తున్నారు.

అసైన్డ్ భూములతో పాటు అన్నిరకాల వారసత్వ బదిలీ ప్రక్రియలు, పాస్‌పుస్తకాలు, జీపీఏ, స్పెషల్ పవర్ ఆఫ్ అటార్నీ (ఎస్‌పీఏ), ఎగ్జిక్యూటెడ్ జీపీఏ, రెండు, మూడు ఖాతాలు నమోదై ఉంటే వాటిని కలపడం, భూసమస్యలకు సంబంధించిన వినతులను తహసీల్దార్ స్థాయిలో పరిష్కరిస్తున్నారు. ఆర్డీవోలు పాస్‌పుస్తకాలు లేకుండా వ్యవసాయేతర భూములుగా నమోదై ఉన్నవి, భూసేకరణ సమస్యలు, ప్రవాసీయులకు చెందిన భూముల సమస్యలు, సంస్థల పేరుతో పాస్‌పుస్తకాలు, కోర్టు కేసులు, సమాచారం, పాస్‌పుస్తకాల్లో తప్పుడు నమోదు, మిస్సింగ్ సర్వే నెంబర్లు, సబ్ డివిజన్ సర్వే నెంబర్లు, విస్తీర్ణం నమోదులో హెచ్చుతగ్గు లను పరిష్కరిస్తున్నారు. జిల్లా కలెక్టర్ స్థాయిలో యాజమాన్య హక్కుల బదిలీ, అసైన్డ్ భూములతో పాటు వారసత్వ బదిలీకి సంబంధించి పాస్‌పుస్తకాలు లేనివి, నిషేధిత భూములు, సెమీ అర్బన్ భూములు, కోర్టు కేసులు పాస్‌పుస్తకాల సమస్యలను పరిష్కరిస్తున్నారు.

జిల్లాలో వివిధ దరఖాస్తుల పరిష్కారం ఇలా..

సమస్య	దరఖాస్తులు	పరిష్కరించినవి	పెండింగ్‌లో..
మ్యూటేషన్	4020	3792	228
ఎల్-ఫాం జారీ	1436	1323	113
గ్రీవెన్ ఆఫ్ ల్యాండ్ మ్యాటర్	7053	7053	0
పాస్‌బుక్ లేకుండా విరాసత్	1043	811	232
ఎన్ఆర్ఐ పాస్‌బుక్	17	14	3
ఆధార్ సీడింగ్	10	10	0
అర్బన్ ల్యాండ్ పీపీబీ	10	10	0
పీపీబీ కోర్టు కేసులు	427	361	66
పీపీబీ లేకుండా నాలా	76	75	1
ఎగ్జిక్యూటెడ్ జీపీఏ	166	164	2
ప్రభుత్వ భూముల దరఖాస్తులు	1082	1064	18
కోర్టు కేసులు	1051	891	160
పీపీబీ సవరణలు	2404	2404	0
ఓఆర్‌జీ పీపీబీ	12	12	0
నాలా కన్వర్షన్	27	21	6
ఖాతా మెర్జింగ్	163	163	0
నిషేధిత భూములు	549	0	549
మొత్తం	19,546	16,845	1,378



ఎప్పటికప్పుడు సమీక్ష..

ధరణి స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా దరఖాస్తుల పరిష్కారంపై ఎప్పటికప్పుడు 'ఆన్‌లైన్'లో సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు తహసీల్దార్, ఆర్డీవో స్థాయిలో ఆన్‌లైన్ డ్యాష్‌బోర్డులను పరిశీలిస్తున్నారు. జిల్లాలో వివిధ రకాల సమస్యలపై ధరణిలో 19,546 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా... ఇప్పటి వరకు 16,845 దరఖాస్తులను క్లియర్ కాగా ఇంకా 1378 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నెల 11న ఒక్కరోజే 1323 దరఖాస్తులను క్లియర్ చేయడం గమనార్హం. పెండింగ్ దరఖాస్తులపై అధికారులను అప్రమత్తం చేసేందుకు జిల్లా, డివిజన్, మండలస్థాయి సమీక్షలు చేస్తున్నారు. ఏ దేమైనా నూతన ప్రభుత్వంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ధరణి భూ సమస్యలు స్పెషల్ డ్రైవ్‌తో వేగంగా పరిష్కారం అవుతున్నాయని వాస్తవం.



సభలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

అధికారం ఎవరికీ శాశ్వతం కాదు..

- అహంకారం లేకుండా పని చేయాలి
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ
- మడికొండలో ఎంపీ కడియం కావ్య ఆత్మీయ సన్మాన సభ

వివరాలు 9లో..

'తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలి'



హైదరాబాద్‌లో రాష్ట్రప్రభుత్వ, సీఎం సలహదారుడు వేం నరేందర్‌రెడ్డితో తెలంగాణ ఉద్యమకారులు

మహబూబాబాద్ టౌన్, జూన్12 : తెలంగాణ ఉద్యమకారులను రాష్ట్రప్రభుత్వం ఆదుకోవాలని టీపీసీసీ అధికార ప్రతినిధి చుక్కల ఉదయ్‌చందర్, ఎస్టీసెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుగులోతు వెంకట్‌నాయక్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో రాష్ట్రప్రభుత్వ, ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డికి బుధవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో తెలంగాణ ఉద్యమకారులకు ఎలాంటి న్యాయం జరగలేదని, నకిలీ ఉద్యమకారులకే అనేక ప్రయోజనాలు చేకూరాయని ఆవేదన వ్యక్తం చేశారు. గల్లీ నుంచి ఢిల్లీ దాకా ఉద్యమాన్ని నడిపించిన వారిని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి తెలంగాణ ఉద్యమకారులు అహర్నిశలు శ్రమించారని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పాల్గొన్న వారిని గుర్తించి 250 గజాలస్థలం ఇచ్చి, ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పుచ్చ బాలకృష్ణ, కామ సంజీవరావు, దిదుగు సుబ్బారావు, చారి పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

- మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి



మునిసిపల్ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, జూన్ 12 : మునిసిపల్ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి సూచించారు. మహబూబాబాద్ శివారు అనంతారం రోడ్‌లో నిర్మితమవుతున్న మునిసిపల్ కార్యాలయ భవన నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణ పనులు పూర్తిచేసి, కార్యాలయ భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పనులు వేగంగా కొనసాగేలా చూడాలని అధికారులకు సూచించారు. వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, డీఈ ఉపేందర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



మహబూబాబాద్ రూరల్, జూన్ 12 : మానుకోట పట్టణంలోని పాతబజారులో పలు కాలనీలో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు టౌన్-1 ఏఈ సంగీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని జగ్జీవన్‌రాం కాలనీ, వాసవి కోల్డ్‌స్టోరేజ్, రామన్నపేట కాలనీ, హౌసింగ్‌బోడ్ కాలనీ, యశోదగార్డెన్, వీఆర్ఎన్ గార్డెన్, బెస్తబజార్, ఎస్సీ కాలనీ, శివాలయం టెంపుల్, నర్సంపేట బైపాస్, గుమ్ముడూరు, మందుల బజారు, గోగుల మల్లయ్య ఏరియా, బస్టాండ్ ఏరియా, మార్కండేయ టెంపుల్, వెంకట్రామ థియేటర్, ఎంవి.మాల్, ఫారెస్టు సెంటర్‌లలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైతుల రుణమాఫీ చేసి తీరుతాం

ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

బయ్యారంలో కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ



బయ్యారంలో కల్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేస్తున్న కోరం కనకయ్య

బయ్యారం, జూన్ 12 : పంద్రాగస్టు నాటికి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టం చేశారు. బయ్యారంలో బుధవారం కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను 41 మంది లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల హామీలను ప్రభుత్వం తప్పకుండా అమలు చేసి, తీరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సాదియాసుల్తాన, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీపీ మౌనిక, సొసైటీ చైర్మన్ మధుకర్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు తిరుమల శైలజరెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు షేక్ బాబా పాల్గొన్నారు.

- గార్ల : ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని మ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో కల్యాణలక్ష్మి చెక్కులను 15 మంది లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజల సంక్షేమమే తమ ధ్యేయమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని, అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తామని పేర్కొన్నారు. ఎంపీపీ భట్టు నాగరాజు, జడ్పీటీసీ జాటోతు ఝాన్సీలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ వడ్లముడి దుర్గాప్రసాద్, తహసీల్దార్ కె.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

'భూములు కోల్పోయిన రైతులను ఆదుకోవాలి'

గార్ల మండలంలో నిర్మితమవుతున్న సీతారామ ప్రాజెక్టు కాలువ నిర్మాణం కింద భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం అందించాలని సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే కనకయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పరిహారం అందించి, ఆదుకోవాలన్నారు. రైతు సంఘం నాయకులు భాగం లోకేశ్వర్ రావు, హరినాయక్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా బడుల పునఃప్రారంభం

- పలు స్కూళ్లలో హాజరైన ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీలు
- మొదటి రోజునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేత

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 12 : జిల్లా వ్యాప్తంగా బుధవారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. తొలిరోజు పాఠశాలను మామిడి తోరణాలతో అలంకరించి, స్కూళ్లకు వచ్చే విద్యార్థులను బ్యాండ్‌మేళాలతో స్వాగతం పలికారు. వేసవి సెలవుల్లో విహార యాత్రలు, బంధువుల ఇళ్లల్లో ఆటపాటలతో సుమారు రెండునెలల పాటు సందడి చేసిన విద్యార్థులు బడులకు రావడంతో సందడిగా మారాయి. విద్యార్థులను పంపించడానికి తల్లిదండ్రులు బుజ్జగించి, ముద్దాడి, సైకిళ్లు, ద్విచక్రవాహనాలపై తీసుకెళ్లి పాఠశాలల్లో చేర్పించారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, గిరిజన, సాంఘిక సంక్షేమ గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు, మహాత్మాజ్యోతిరావు పూలే, మైనార్టీ గురుకుల, ఏకలవ్య గురుకుల పాఠశాలలు, మోడల్ స్కూల్స్‌తోపాటు ప్రైవేటు పాఠశాలలు మొత్తం 1,054 ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో లక్షకుపైగా విద్యార్థినీ, విద్యార్థులు పాఠశాలల్లో నమోదై ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించేందుకు మధ్యాహ్న భోజన వంట ఏజెన్సీలు పొయ్యిలు వెలిగించి, వంటలు ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికోన్న పాఠశాలలో అటెండర్ పాఠశాల పునఃప్రారంభం కావడంతో నిర్దీత సమయం 8.45 నిమిషాలకు గంట మోగించారు. తొలిరోజు కావటం వల్ల వివిధ పట్టణాలు, గ్రామాల నుంచి వచ్చే ఉపాధ్యాయులు, విద్యార్థుల రాకతో విద్యాసంస్థలు నూతన విద్యా సంవత్సర శోభను సంతరించుకుంది.



దంతాలపల్లిలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్



మహబూబాబాద్ శివారు శనిగపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీలు హాజరు..

మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని సీతారాంపూర్ హైస్కూల్, ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న స్కూల్ యూనిఫామ్, పాఠ్య, నోట్‌పుస్తకాలను ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ విద్యార్థులకు అందచేశారు. దంతాలపల్లి మండల కేంద్రంతో పాటు బీరిశెట్టిగూడెంలోని బడిబాట కార్యక్రమంలో ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ పాల్గొన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తోందని చెప్పారు. మండల అధ్యక్షుడు భట్టు, నాయకులు పొన్నొటి బాలాజీ, శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, భూపాల్ రెడ్డి పాల్గొన్నారు. మానుకోట పట్టణశివారు శనిగపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీలు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, తొర్రూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పాల్గొని పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం అందజేశారు. గార్ల మండలం పెద్దకిష్టాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కురవి మండలం బంచరాయితండా, బంగారిగూడెం తండాల ప్రాథమిక పాఠశాలలను సందర్శించి, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి పాల్గొని, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు అంతంతే!

జిల్లా వ్యాప్తంగా సోమవారం ప్రారంభమైన ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు నామమాత్రంగానే విద్యార్థులు హాజరయ్యారు. ఈనెల 6వ తేదీ నుంచే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రొఫెసర్ జయశంకర్

మిగతా 10వ పేజీలో..

కొనసాగుతున్న బడిబాట..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచడానికి బడిబాటలో భాగంగా విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు గ్రామాలు, తండాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు.

- ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమాన్ని కొనసాగిస్తున్నామని స్థానిక ప్రజాప్రతినిధులు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలతో ఉపాధ్యాయులు చర్చిస్తున్నారు.
- బడిబయట ఉన్న పిల్లల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేల అవగాహన కల్పిస్తున్నారు.
- కస్తూర్బా బాలికల విద్యాలయాల ప్రత్యేక అధికారులు పాఠశాలల్లో చేరే విద్యార్థినీలు, వారి తల్లిదండ్రులకు ప్రభుత్వం పాఠశాలల్లో కల్పిస్తున్న మౌళిక వసతులు, ఆడపిల్లలకు కల్పిస్తున్న ప్రత్యేకతలను వివరిస్తున్నారు.
- జిల్లా వ్యాప్తంగా ఈనెల 6వ తేదీ నుంచి 12 వరకు నిర్వహించిన బడిబాటలో 2,477 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించారు.



పెరుమాండ్ల సంకీసలో ప్రాథమిక పాఠశాల గేటుకు తాళంవేసిన కాంట్రాక్టర్

బిల్లు రాలేదని..

స్కూల్‌కు తాళం వేసిన కాంట్రాక్టర్

తిరిగి వెళ్లిపోయిన ఉపాధ్యాయులు, విద్యార్థులు

డోర్నకల్, జూన్ 12 : మండలంలోని పెరుమాండ్ల సంకీస ప్రాథమిక పాఠశాలకు బుధవారం ఓ కాంట్రాక్టర్ తాళం వేశాడు. 'మన ఊరు-మన బడి' కార్యక్రమంలో భాగంగా స్కూల్‌కు నూతన బిల్డింగ్ నిర్మాణం, ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.60 లక్షలు నిధులు మంజూరయ్యాయి. పనులు చేస్తున్న సమయంలో కొంతబిల్లును పంచాయతీరాజ్‌శాఖ కాంట్రాక్టర్‌కు చెల్లించింది. తర్వాత కాంట్రాక్టర్ పనులు మొత్తం పూర్తి చేశాడు. నిర్మాణం పూర్తై ఏడాది గడుస్తున్నప్పటికి కాంట్రాక్టర్‌కు రావాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో పలుమార్లు అధికారుల వద్ద విన్నవించుకున్నాడు. అయినప్పటికి బిల్లులు చెల్లించకపోవడంతో సదరు కాంట్రాక్టర్ పాఠశాలకు ఏకంగా తాళం వేశాడు. బుధవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. కాంట్రాక్టర్ గేటుకు తాళం వేయడంతో పాఠశాల వద్దకు వచ్చిన ఉపాధ్యాయులు, విద్యార్థులు వెనుదిరిగి వెళ్లారు. పాఠశాలకు తాళం వేసిన విషయాన్ని ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.

కిట్స్ అధ్యాపకుడికి డాక్టరేట్



హసన్‌పర్తి, జూన్ 12: ఎర్రగట్టుగుట్ట వద్ద గల కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న నలిగంటి సంతోష్‌కుమార్‌కు విశాఖపట్నం గీతం యూనివర్సిటీ పీహెచ్‌డీని ప్రదానం చేసినట్లు ప్రిన్సిపాల్ కె.అశోక్‌రెడ్డి బుధవారం తెలిపారు. 'బ్లడ్ వేసెల్ సిగ్మెంటేషన్ ఫ్రమ్ డయాబెటిక్ రెటినోపతి ఫండస్ ఇమేజెస్ యూజింగ్ సింగులర్ వాల్యూ డికపోజిషన్ అండ్ మాక్సిమమ్ ప్రిన్సిపల్ కర్వేచర్' అనే అంశంపై పరిశోధనలు సమర్పించినందుకు గాను పీహెచ్‌డీ వచ్చినట్లు పేర్కొన్నారు. సంతోష్‌కుమార్‌కు పీహెచ్‌డీ రావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి, చైర్మన్ కెప్టెన్ లక్ష్మీకాంతరావు, కోశాధికారి నారాయణరెడ్డి, తోటి అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

19న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 12: హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 19న నిర్వహిస్తున్న జాబ్ మేళాను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఐఈవో ఎ.గోపాల్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. హెచ్‌సీఎల్ టెక్‌బీ ప్రోగ్రాం కోసం సీఈసీ, హెచ్ఈసీ, వొకేషనల్ కంప్యూటర్స్ కోర్సుల్లో 75 శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఈ జాబ్ మేళాలో డీవీవో రోల్ కోసం ఎంపిక చేసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 2023, 2024 విద్యా సంవత్సరాల్లో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు హాజరుకావచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు 7569177071 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

కేజీబీవీల్లో సరుకుల సరఫరాకు టెండర్ల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 12: జిల్లాలోని 9 కేజీబీవీలు, 3 మోడల్ స్కూళ్లు, ఒక్క అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో వివిధ సరుకులు సరఫరా చేసేందుకు ఆసక్తిగల వారి నుంచి టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు డీఈవో అబ్దుల్ హై బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సరుకులు, పండ్లు, కూరగాయలు, గుడ్లు, చికెన్, మటన్ తదితర వస్తువులు సరఫరా చేసేందుకు సీల్డ్ టెండర్లు దాఖల చేయాలని తెలిపారు. ఆసక్తి గల వారు కలెక్టర్ పేరున తీసిన రూ.500 డీడీ చెల్లించి టెండర్ ఫారాలు తీసుకొని ఈనెల 21 మధ్యాహ్నం 3 గంటల వరకు డీఈవో కార్యాలయంలోని టెండర్ బాక్స్‌లో వేయాలని కోరారు. వేర్వేరు వస్తువులకు వేర్వేరు టెండర్లు దఖాలు చేయాలని తెలిపారు.

ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ఆలస్యం?

నీట్-2024పై రగడే కారణం!.. తెలంగాణలో 56 కాలేజీల్లో 8,515 ఎంబీబీఎస్ సీట్లు

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వైద్య విద్యకు సంబంధించి ఎంబీబీఎస్ ప్రవేశాల ప్రక్రియ ఈ ఏడాది ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. నీట్-2024పై దేశ వ్యాప్తంగా జరుగుతున్న రగడే ఇందుకు కారణం. నీట్ మార్కులపై ఇప్పటికే సుప్రీం కోర్టులో కేసు నడుస్తోంది. నీట్-2024ను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్న పిల్‌ను కోర్టు తోసిపుచ్చింది. కానీ, నీట్ విషయంలో మరిన్ని కేసులు పడే అవకాశం ఉందని, విషయం అంత త్వరగా తేలేట్లుగా కనిపించడం లేదని జాతీయ వైద్య విద్య కమిషన్(ఎన్ఎంసీ) అధికారులు రాష్ట్ర వైద్య విద్య ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. మరోపక్క, దేశ వ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీలు, వాటిలోని సీట్ల వివరాలను ఎన్ఎంసీ తన వెబ్‌సైట్‌లో పెట్టింది. విద్యార్థులు ఆయా కళాశాలల్లోనే చేరాలనే పేర్కొంది. ఎన్ఎంసీ వెబ్‌సైట్ ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు కలిపి తెలంగాణలో 56 వైద్య కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో మొత్తం 8,515 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి.

కొత్త కాలేజీల సంగతేంటో?

రాష్ట్రం ప్రభుత్వం దరఖాస్తు చేసిన కొత్త వైద్య కళాశాలల అనుమతిపై ఎన్ఎంసీ ఏటూ తేల్చడం లేదు. అనుమతి ఇస్తారో ? ఇవ్వరో కూడా స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో కొత్త కళాశాలల్లో ఈ ఏడాది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడం అనుమానంగానే ఉంది. గద్వాల, వరంగల్(నర్సంపేట్), యాదాద్రి, మేడ్చల్ (కుత్బుల్లాపూర్), నారాయణపేట్, ములుగు, మెదక్, రంగారెడ్డి(మహేశ్వరం) జిల్లాల్లో వైద్య కళాశాలల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఆగస్టు- సెప్టెంబరులో ఎన్ఎంసీకి దరఖాస్తు చేసింది. ఆయా కళాశాలలను వర్చువల్‌గా, స్వయంగా తనిఖీ చేసిన ఎన్ఎంసీ బృందాలు పలు లోపాలను ఎత్తి చూపి వాటిని సరిచేసుకోవాలని సూచించాయి. ఆ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ లోపాలను సవరించింది. అయితే వైద్య కళాశాలలకు లెటర్ ఆఫ్ పర్మిషన్(ఎల్ఓపీ) ఇచ్చేముందు ఎన్ఎంసీ బృందాలు మరోమారు తనిఖీ చేస్తాయి. మరికొద్ది రోజుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కానుండగా, ఎన్ఎంసీ బృందాలు ఇప్పటిదాకా మళ్లీ తనిఖీలకు రాలేదు. నిజానికి, తాము ఎత్తిచూపిన లోపాలను సరి చేసుకున్నట్టు చూపించిన తర్వాత వాటికి సంతృప్తి చెందితేనే ఎన్ఎంసీ అనుమతి ఇస్తుంది. ఒకవేళ అనుమతి ఇవ్వకపోతే ప్రభుత్వం అప్పీలు చేసుకునే వీలుంటుంది. ప్రభుత్వ కళాశాల కాబట్టి సర్కారే గ్యారంటీగా ఉండి లోపాలను సవరించుకుంటామని లిఖితపూర్వక హామీనిస్తుంది. దాంతో ఎన్ఎంసీ అనుమతి మంజూరు చేస్తుంది. ఈ వ్యవహారానికి 20-30 రోజుల సమయం పడుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. దీంతో త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరుతూ వైద్యవిద్య సంచాలకులు ఎన్ఎంసీకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఎన్ఎంసీ ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది. మరోపక్క, అనుమతుల విషయమై కొన్ని వైద్య కళాశాలల యాజమాన్యాలు ఇప్పటికే కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిని కలిసి చర్చినట్టు సమాచారం.

గ్రూప్-1 మెయిన్స్ 7 రోజులు

(మొదటిపేజీ తరువాయి)

మీడియంలోనే రాయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న సమయంలోనే ఏ మీడియంలో రాసేదీ తెలపాల్సి ఉంటుంది. ఒక పరీక్ష తెలుగులో, మరో పేపర్‌ను ఇంగ్లిష్‌లో రాయడానికి వీల్లేదు. అలా వేర్వేరు మాధ్యమాల్లో రాసినవారి పేపర్లను పరిగణనలోకి తీసుకోరు. రాష్ట్రంలో సుమారు 563 గ్రూపు-1 పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఈ నెల 9వ తేదీన నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను త్వరలోనే ప్రకటించనున్నారు. అందులో ఉత్తీర్ణులైనవారిని.. ఒక్కో పోస్టుకు 50 మంది అభ్యర్థుల చొప్పున మెయిన్ పరీక్షకు ఎంపిక చేయనున్నారు. మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచే అభ్యర్థులను పోస్టులకు ఎంపిక చేస్తారు. ఈ నియామకాల్లో ఏలాంటి ఇంటర్వ్యూలూ ఉండవు. మెయిన్ పరీక్షలకు సంబంధించిన వివరాలను కమిషన్ అధికారులు బుధవారం వెల్లడించారు. ఆ వివరాల ప్రకారం..

ఇదీ షెడ్యూలు

తేదీ	పేపర్
అక్టోబరు 21	జనరల్ ఇంగ్లిష్
అక్టోబరు 22	జనరల్ ఎస్సే (పేపర్-1)
అక్టోబరు 23	చరిత్ర, కల్చర్ అండ్ జాగ్రఫీ (పేపర్-2)
అక్టోబరు 24	ఇండియన్ సొసైటీ, రాజ్యాంగం-గవర్నెన్స్ (పేపర్-3)
అక్టోబరు 25	ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ (పేపర్-4)
అక్టోబరు 26	సైన్స్ అండ్ టెక్నాలజీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ (పేపర్-5)
అక్టోబరు 27	తెలంగాణ మూమెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్ (పేపర్-6)

- పరీక్షల తొలిరోజు అయిన అక్టోబరు 21న క్వాలిఫైయింగ్ టెస్ట్ (జనరల్ ఇంగ్లిష్ పరీక్ష) నిర్వహించనున్నారు. అనంతరం ఇతర పేపర్ల పరీక్షలను నిర్వహిస్తారు. క్వాలిఫైయింగ్ టెస్ట్ కాకుండా మెయిన్స్‌లో మొత్తం 6 పేపర్లకు పరీక్షలను నిర్వహిస్తున్నారు.
- పరీక్షలన్నీ హైదరాబాద్, దాని చుట్టు పక్కల హెచ్ఎండీఏ పరిధిలోనే జరుగుతాయి.
- ప్రతిపేపర్‌లోనూ 150 మార్కులకు ప్రశ్నలుంటాయి.
- అభ్యర్థులు అన్ని పేపర్లూ రాయాల్సి ఉంటుంది. ఏ ఒక్క పరీక్షకు గైర్హాజరైనా ఆ అభ్యర్థులు రాసిన ఇతర పేపర్లను పరిగణనలోకి తీసుకోరు.
- క్వాలిఫయింగ్ పరీక్షను 10వ తరగతి ప్రమాణాలతో నిర్వహిస్తారు. ఇతర పేపర్ల పరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను ఇప్పటికే ప్రకటించారు.

గ్రూప్-1 ప్రిలిమినరీ కీ విడుదల

ఈ నెల 9వ తేదీన నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష కీని విడుదల చేశారు. గురువారం (13వ తేదీ) నుంచి 17వ తేదీ మధ్య ఈ కీ కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది. కీపై అభ్యంతరాలుంటే.. 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తెలపాల్సిందిగా అభ్యర్థులకు అధికారులు సూచించారు.

ఔటర్.. బంగారు బాతే!

వాహనాల రద్దీతో నెల నెలా పెరుగుతున్న ఆదాయం

- ఏప్రిల్‌లో రూ.60 కోట్లు..
- మే నెలలో 62.7 కోట్ల రాబడి



హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు.. ఆదాయ పరంగా బంగారు బాతు అన్నది స్పష్టమవుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీతో ఆదాయం భారీగా పెరుగుతోంది. ప్రతి నెలా హెచ్ఎండీఏ అధికారులు ఊహించని స్థాయిలో రాబడి వస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డును లీజుకు ఇచ్చే సందర్భంలో ఓ ప్రైవేటు ఏజెన్సీ మదింపు చేసిన ఆదాయ అంచనాలన్నీ తలకిందులవుతున్నాయి. అప్పుడు.. ఏడాదికి 2శాతం నుంచి 3శాతం వరకు ఆదాయం పెరుగుతుందని అంచనాలు వేయగా, ప్రస్తుతం ఒక్కో నెలకే 4శాతానికి పైగా పెరుగుతోంది. టోల్ చార్జీలు పెంచకముందే ఆదాయం ఈ స్థాయిలో పెరుగుతుండడంతో.. చార్జీల పెంపుతో మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఔటర్ ఆదాయంపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాలు అక్షరసత్యాలు అని నిరూపితమవుతున్నాయి. గతేడాది ఔటర్ రింగ్ రోడ్డును హెచ్ఎండీఏ గత ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓ ప్రైవేటు సంస్థకు కట్టబెట్టిన విషయం తెలిసిందే. దీంతో ఏటేటా భారీ ఆదాయాన్ని సమకూర్చే ఔటర్‌ను చాలా తక్కువ బిడ్‌కు 30 ఏళ్లకు లీజుకివ్వడాన్ని ప్రస్తావిస్తూ.. 'రాసిచ్చేశారు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం ప్రచురించింది. దీంతోపాటు ఔటర్‌పై ఏటా పెరిగే ఆదాయ, వ్యయాలను అంచనా వేసి చూపిస్తూ.. రాష్ట్రానికి బంగారు బాతు లాంటి ఔటర్‌ను ప్రైవేటుపరం చేయడాన్ని పేర్కొంటూ 'బంగారు బాతు.. బలి' అనే శీర్షికతో కథనం ప్రచురించింది. ఈ కథనాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారడంతోపాటు అప్పటి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాయి. విపక్షాలకు అస్త్రంగా మారాయి. ఆ కథనాలన్నీ ఇప్పుడు అక్షరసత్యాలుగా నిరూపితమవుతున్నాయి.

టోల్ చార్జీల పెంపుతో సంబంధం లేకుండానే

ఔటర్‌ను ప్రైవేటు సంస్థకు అప్పగించిన సందర్భంలో ఆదాయాన్ని మదింపు చేసిన ఏజెన్సీ.. ఏటా 2శాతం నుంచి 3శాతానికి అటు, ఇటుగా రాబడి పెరుగుతుందని అంచనాలు వేసింది. ముఖ్యంగా హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్ (డబ్ల్యూపీఐ) ప్రకారం ఏటా టోల్ చార్జీల్లో చోటుచేసుకునే 4శాతం నుంచి 5శాతం పెంపుదల మేరకే ఆదాయం పెరుగుతుందని ఆ ఏజెన్సీ తేల్చింది. సాధారణంగా ఏప్రిల్ నుంచి కొత్తగా అందుబాటులోకి వచ్చే టోల్ చార్జీలతో ఆ ఆర్థిక సంవత్సరానికి ఆదాయం పెరుగుతుందని హెచ్ఎండీఏ అధికారులు కూడా అంచనాలు వేశారు. కానీ, ప్రస్తుతం టోల్ చార్జీలు పెంచకుండానే ప్రతి నెలా ఆదాయం పెరుగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.60.2 కోట్ల ఆదాయం రాగా, మే నెలలో రూ.62.7 కోట్లు వచ్చింది. అంటే దాదాపు రూ.2.5 కోట్లు పెరిగింది. ఒక్క నెలకే 4.2 శాతం పెరుగుదల నమోదైంది. ఈ పెరుగుదల గతేడాది నుంచి కొనసాగుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ వాహనాల రద్దీ పెరుగుతుండడంతో ఆ మేరకు ఆదాయం పెరుగుతోంది. కాగా, డబ్ల్యూపీఐ ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఔటర్ రింగ్ రోడ్డుపై టోల్ చార్జీలు ఏప్రిల్ 1 నుంచే పెరగాలి. కానీ, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటిని పెంచకుండా నిలిపివేశారు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ముగియడంతో టోల్ చార్జీలు పెంచుకోవడానికి అవకాశం కల్పించారు. దాంతో ఈ చార్జీలు 4శాతం నుంచి 5శాతం మేర పెరిగాయి. ఇందుకు అనుగుణంగా ఆదాయం పెరుగుతుందని, వాహనాల రద్దీ ద్వారా వచ్చే ఆదాయం అదనంగా ఉంటుందని హెచ్ఎండీఏ- హెచ్‌జీసీఎల్‌కు చెందిన ఓ అధికారి తెలిపారు.

నేడు లాసెట్ ఫలితాల విడుదల

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): లాసెట్ ఫలితాలను ఈ నెల 13వ తేదీన విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. గురువారం సాయంత్రం 3.30 గంటలకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి ఈ ఫలితాలను ప్రకటించనున్నారు.

నేటి నుంచి రెండోదశ దోస్త్

డిగ్రీలో ప్రవేశాలకు సంబంధించి 13వ తేదీ నుంచి రెండో దశ దోస్త్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలు కానుంది. మొదటి దశలో సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు 15వ తేదీలో ముగియనుంది. 14,15వ తేదీల్లో అభ్యర్థులు తమ వెబ్‌ఆప్షన్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

రెసిడెన్షియల్ కోసం అద్దె భవనం కావాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 12: సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాల కోసం ములుగు జిల్లా పరిధిలో అద్దె భవనం కావాలని ఆర్‌సీవో ఎస్.విద్యారాణి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. బాలురు, బాలికల పాఠశాల/కళాశాల నిర్వహణ కోసం 16 తరగతి గదులు, డైనింగ్ హాల్, ల్యాబ్‌లు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా గదులు, అన్ని వసతులున్న భవనం కావాలని ఆమె కోరారు. ఆసక్తి ఉండి, భవనం ఉన్న వారు 7995010600/7995010599 నెంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

నిజామాబాద్‌కు 12 డీలక్స్ సర్వీసులు

బాలసముద్రం, జూన్ 12: వరంగల్ నుంచి నిజామాబాద్‌కు 12 డీలక్స్ బస్సు సర్వీస్‌లను గురువారం నుంచి నడుపుతున్నట్లు వరంగల్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జాన్సి శ్రీలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ మేనేజర్ శ్రీలత ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యం కోసం అదనంగా 12 డీలక్స్ బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వరంగల్ నుంచి ఉదయం 4.15 గంటలకు, రాత్రి 11 గంటల వరకు ప్రతీ అరగంటకు ఒక డీలక్స్ బస్సు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ సౌకర్యాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని ఆమె ప్రకటనలో కోరారు. వరంగల్ నుంచి నిజామాబాద్‌కు ఒకరికి రూ. 350, హనుమకొండ నుంచి నిజామాబాద్‌కు రూ.340, కరీంనగర్ నుంచి నిజామాబాద్‌కు రూ. 230, హనుమకొండ నుంచి కరీంనగర్‌కు రూ 120 టికెట్ ధర తీసుకోనున్నట్లు శ్రీలత తెలిపారు.

అధికారం ఎవరికీ శాశ్వతం కాదు..

● అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ● మడికొండలో ఎంపీ కడియం కావ్య ఆత్మీయ సన్మాన సభ



మడికొండలో జరిగిన అభినందన సభలో అభివాదం చేస్తున్న కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు

మడికొండ, జూన్ 12: అధికారం అలంకారం మాత్రమేనని, అది శాశ్వతం కాదని అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్ హాల్‌లో బుధవారం స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధ్యక్షతన నిర్వహించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆత్మీయ పరిచయ, సన్మాన సభలో మంత్రి సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

గత ప్రభుత్వ హయాంలో వారు చేసిన అవినీతి, అక్రమాలే వారి ఓటమికి కారణాలయ్యాయని, అలాంటి పరిస్థితి మనం తెచ్చుకోకూడదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు.. ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో నిష్పక్షపాతంగా, అవినీతిరహితంగా ఒక్క రూపాయి ఆశించకుండా నిరుపేదల ఇంటికి చేరే విధంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆ విధంగా పనిచేస్తేనే రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరిస్తారన్నారు. అధికారం ఉంది కదా అని అహంకారం చూపిస్తే బీఆర్ఎస్ పార్టీని బొందపెట్టినట్టే మన ప్రభుత్వాన్ని సైతం ప్రజలు తిరస్కరిస్తారని హితవు పలికారు. తనకు కూతురులాంటి డాక్టర్ కడియం కావ్య.. తండ్రిని మించిన నాయకురాలిగా ఎదిగి మచ్చలేని తన తండ్రి పేరును నిలబెట్టాలన్నారు. వరంగల్ లోక్‌సభ సెగ్మెంట్‌లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభివృద్ధికి నిధులు కేటాయించాలన్నారు. అలాగే పార్లమెంట్‌లో సమస్యలపై ఎలా గళం ఎత్తాలన్నారు. అనంతరం ఎంపీ డాక్టర్ కావ్య మాట్లాడుతూ.. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం పార్లమెంట్‌లో గళం ఎత్తుతానని అన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా ఉంటే రానున్న మరో పదిహేనేళ్ల రాష్ట్రంలో అధికారంలో ఉంటుందన్నారు. వరంగల్ లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు అన్నింటికీ సమ ప్రాధాన్యం ఇచ్చి నిధులు అందజేస్తానని తెలిపారు. అలాగే తనకు రాజకీయ జీవితం ఇచ్చిన తన తండ్రికి మచ్చరాకుండా మంచిపేరు తీసుకు వచ్చేలా పనిచేస్తానని తెలిపారు.

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. పాత, కొత్త అనే తేడాలేకుండా పనితరును, అభిమానాన్ని బట్టి అందరికీ అవకాశాలు లభిస్తాయన్నారు. రాజకీయాల్లో మర్యాద, నిజాయితీలే కాపాడుతాయన్నారు. తన మాట తీరు చాలామందికి బాధ కలిగించిదని, అర్థం చేసుకున్న తర్వాత వారే స్వీకరిస్తున్నారన్నారు. నాయకులు అవినీతి, అక్రమాలకు పాల్పడితే కార్యకర్తలే గౌరవించరన్నారు. ప్రస్తుత రాజకీయాల్లో డబ్బు పంచడం, పథకాలు అమ్ముకోవడం సర్వసాధారణమైందని, తాను మాత్రం ఏ పనిచేసినా ఎవరి వద్ద నుంచి కూడా ఒక్క పైసా అడగనన్నారు. ఎవరైనా తన పేరుతో డబ్బులు అడిగితే వారిపై చర్యలు తీసుకుంటానన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని అవినీతి రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. కిందిస్థాయి నాయకులు సైతం భూ వివాదాలు, భూ కబ్జాలు, అక్రమాలకు పాల్పడే వారికి వంతపాడకూడదని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో అనేక సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు ఉన్నాయని, వాటిపై దృష్టి పెట్టి అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఎవరైనా గ్రూపు రాజకీయాలకు పాల్పడితే తోకలు కత్తిరిస్తామని కడియం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాష్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, మేయర్ గుండు సుధారాణి, కాంగ్రెస్ పార్టీ స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇందిర, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతకుముందు స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు జాతీయ రహదారి నుంచి కావ్యను, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని వాహనంలో కన్వెన్షన్ హాల్‌కు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా దారిపొడవునా పూల వర్షం కురిపించారు. టపాసుల మోతతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. బంజారా, లంబాడా మహిళలు తమ సంస్కృతీ సంప్రదాయ దుస్తులు ధరించి బంజారా నృత్యం చేస్తూ కావ్య, శ్రీహరికి ఘన స్వాగతం పలికారు. అనంతరం పార్టీ శ్రేణుల గజమాలతో కావ్యను, శ్రీహరిని ఘనంగా సత్కరించారు.

తేనెటీగల దాడితో మృతదేహాన్ని వదిలి పరిగెత్తారు..

పలువురికి తీవ్రగాయాలు, ఆస్పత్రికి తరలింపు



కొత్తగూడ మండలం ఎంచగూడెంలో వీరస్వామి మృతదేహాన్ని వదిలి వెళ్తున్న బంధువులు, గ్రామస్థులు, రోడ్డుపై వీరస్వామి మృతదేహం

కొత్తగూడ, జూన్ 12 : ఓ వ్యక్తి అంతిమయాత్ర నిర్వహిస్తున్న క్రమంలో తేనెటీగలు దాడిచేయగా.. వారంతా మృతదేహాన్ని రోడ్డుపైనే వదిలేసి పరిగెత్తిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఎంచగూడెం గ్రామంలో బుధవారం జరిగింది. ఎంచగూడెం గ్రామానికి చెందిన రుద్రారపు వీరాస్వామి (50) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. బుధవారం అతడి దహనసంస్కారాలు నిర్వహించేందుకు గాను కుటుంబసభ్యులు, బంధువులు, స్థానికులు అంతిమయాత్రగా శ్మశానవాటికకు బయల్దేరారు. వారు గ్రామశివారులో చేరుకున్న తర్వాత టపాసులు పేల్చగా వాటి పొగ, శబ్దానికి చెట్టుపై ఉన్న తేనేటీగలు ఒక్కసారిగి లేచి దాడి చేశాయి. దీంతో స్థానికులు, బంధువులు వీరస్వామి మృతదేహాన్ని రోడ్డుపైనే వదిలి పరుగు తీశారు. ఆతర్వాత వారంతా సుమారు గంట తర్వాత అక్కడికి వచ్చి వీరాస్వామి మృతదేహాన్ని తీసుకెళ్లి దహనసంస్కారాలు పూర్తి చేశారు. నిర్వహించారు. కాగా, తేనేటీగల దాడిలో కందికొండ యాకయ్య, కందికొండ మల్లయ్య, జిట్టి కొమురయ్యతో పాటు పలువురికి తీవ్రగాయాలు కావడంతో 108లో వరంగల్ జిల్లాలోని నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అటవీ ప్రాంతాన్ని జల్లెడ పట్టిన అధికారులు

గూడూరు, జూన్ 12 : గూడూరు అటవీశాఖ రేంజ్‌పరిధిలోని గూడూరు సెక్షన్, సౌత్‌బీట్ పరిధిలోని గండి చెరువు అటవీప్రాంతాన్ని గూడూరు ఎఫ్‌డీవో చంద్రశేఖర్, రేంజ్ అధికారి సురేష్ ఆదేశాల మేరకు బుధవారం అటవీశాఖ సిబ్బంది గస్తీగా తిరుగుతూ.. జల్లెడ పట్టారు. మంగళవారం రాత్రి గండి చెరువు అటవీప్రాంతంలో టేకు, ఇతర జాతుల చెట్ల నరికివేత, తరలించేందుకు సిద్ధంగా ఉన్న కలపను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. ముగ్గురు సెక్షన్ అధికారులతో కూడిన మూడు బృందాలు అటవీలో చెట్లను నరికి వేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. నరికివేతకు గురైన చెట్లకు నెంబర్లు వేశారు. చుట్టుపక్కల ఉన్న తండాల్లో ఇండ్లలో సోదాలను నిర్వహించారు. అటవీలో ఉన్న చెట్లను నరికివేసిన వారిని గుర్తించేందుకు ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేస్తున్నారు.


గూడూరు గండిచెరువు అటవీప్రాంతంలో పర్యటిస్తున్న క్షేత్రస్థాయి అధికారులు

ఉదాసీనత, తప్పిదాలు జరిగితే చర్యలు : ఎఫ్‌డీవో

అడవులు, వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా క్షేత్రస్థాయి అధికారులు ఉదాసీనతతో తప్పిదాలు జరిగితే శాఖపరమైన చర్యలు తప్పవని గూడూరు ఎఫ్‌డీవో చంద్రశేఖర్ హెచ్చరించారు. గూడూరు అటవీశాఖ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అడవులను రక్షించడానికి ప్రభుత్వం అనేక రకాల నిబంధనలు అమలు చేస్తుందన్నారు. అటవీప్రాంతంలో తప్పనిసరిగా బీట్ ఇన్‌స్పెక్షన్ చేయాలన్నారు. పైఅధికారులు సైతం ఆయా బీట్ పరిధిలో స్పెషల్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించాల్సి ఉందన్నారు. ఎవరైనా అడవుల్లో ఉచ్చులు పెట్టి వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. అటవీలో చెట్లను నరికి వేసి స్మగ్లింగ్‌కు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. విధుల నిర్వహణలో సిబ్బంది అన్నివేళలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిరంతరం అడవులను రక్షించడానికి పాటుపడాలని కోరారు. అటవిసంపదను కాపాడటంలో అటవిశాఖ సిబ్బంది జాగ్రత్తగా ఉండాలన్నారు. అడవులు సమృద్ధిగా ఉంటేనే వర్షాలు బాగా కురుస్తాయని, కాలుష్యం కూడా దరిచేరదని, వన్యప్రాణులు స్వేచ్ఛగా జీవిస్తాయని వెల్లడించారు. రేంజ్ అధికారి సురేష్, డీఆర్వో మాధవి, సెక్షన్ అధికారులు శ్రీనివాస్, హట్యసింగ్, జగ్గయ్య, బీట్ అధికారులు నరేందర్, చంద్రయ్య, బేస్‌క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పాడైపోయిన కోడిగుడ్ల పంపిణీ


కోమట్లగూడెంలో పాడైపోయిన కోడిగుడ్లు

గంగారం, జూన్ 12 : పోషకాలతో కూడిన ఆహార పదార్థాలు తీసుకుని తల్లిబిడ్డా ఆరోగ్యంగా ఉండాలని.. కోరే ఐసీడీఎస్ కార్యకర్త పాడైపోయిన కోడిగుడ్లు పంపిణీ చేసిన ఘటన కోమట్లగూడెంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కోమట్లడెం అంగన్‌వాడీ టీచర్ బుధవారం కోమట్లగూడెంకు చెందిన ఐదుగురు బాలింతలకు కోడిగుడ్లు పంపిణీ చేసింది. వాటిని తీసికెళ్లిన బాలింత జాడి వసంత సాయంత్రం ఆమ్లేట్ వేద్దామని పగలకొడితే గుడ్ల నుంచి దుర్వాసనవస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. మండల వ్యాప్తంగా 24 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. ప్రతీ సెంటర్‌లోని గర్భిణీ, బాలింతకు, చిన్నారులకు వారికి కేటాయించిన కోడిగుడ్లు పదిహేను రోజులకు ఒకసారి పంపిణీ చేయాల్సి ఉంది. అందులో భాగంగా కోమట్లగూడెం ఐసీడీఎస్ సెంటర్‌కు ఈనెల 7వ తేదీన వచ్చిన కోడిగుడ్లను తీసుకువెళ్లటానికి వచ్చిన ఐదుగురు గర్భిణీలకు.. గత నెలలో వచ్చిన కోడిగుడ్లు (పాడైనవి) కలిపి ఇవ్వటంతో అవి కుళ్లిపోయాయని బాధితులు ఆరోపించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం కాపాడే ఐసీడీఎస్ టీచర్లే ఇలా నిర్లక్ష్యంగా కుళ్లిన కోడిగుడ్లను పంపిణీ చేస్తే తమ ఆరోగ్యాలు ఏమైపోవాలంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై ఐటీడీఎస్ సూపర్‌వైజర్ రామలక్ష్మిని వివరణ కోరగా.. గంగారానికి పక్షం రోజులకు ఐదువేల గుడ్లు పంపిణీ చేస్తామన్నారు. కోమట్లగూడెం సెంటర్‌కు ఈనెల 7వ తారీకున వచ్చిన గుడ్లకు బదులు పాతగుడ్లు (పాడైనవి) కలిపి ఇవ్వటంతో తప్పిదం జరిగిందన్నారు. ఈరోజు పంపిణీ చేసిన వారినుంచి గుడ్లను తిరిగి తీసుకోవాలని ఆదేశించామన్నారు. ఈ విషయంపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

'ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి'


డీఈవో రామారావుకు వినతి పత్రం అందజేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నేతలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్12 : ఉపాధ్యాయుల పదోన్నతుల్లో అడక్వసీ పేరుతో ఎస్టీ ఉపాధ్యాయులకు జీరో ప్రమోషన్స్‌పై న్యాయం చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి చాగంటి ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం డీఈవో రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గతంలో ఎన్నడు లేనివిధంగా అడక్వసీ పేరుతో గిరిజన ఉపాధ్యాయులకు పీఎస్ హెచ్‌ఎం, సాంఘికశాస్త్రం, బయోసైన్స్, ఇంగ్లీష్ యందు ఒక్క పదోన్నతి కూడా లేదని తెలిపారు. గత 20, 25 సంవత్సరాలుగా పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. అడక్వసీ రూపంలో ఎస్టీ ఉపాధ్యాయులకు జరుగుతున్న అన్యాయాన్నినివారించి న్యాయం చేయాలన్నారు. మాలోతు భద్రునాయక్, రంగన్న, కిషన్‌నాయక్, బాబు, నాగేశ్వర్‌రావు, రామకృష్ణ పాల్గొన్నారు.

'బాలకార్మికుల చట్టాలపై అవగాహన ఉండాలి'

తొర్రూరు, జూన్ 12 : ప్రజలందరూ బాలకార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం తొర్రూరులోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత హాజరై మాట్లాడుతూ తల్లిదండ్రులు 14 సంవత్సరాల లోపు పిల్లలను పనికి పంపరాదని, షాపు యజమానులను కూడా వారిని పనిలోకి చేర్చుకోవద్దన్నారు. అలా జరిగితే చట్టపరమైన చర్యలుంటాయని తెలిపారు. పిల్లలను పాఠశాలకు పంపించాలని, విద్యను అభ్యసిస్తే వారు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని, తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ పిల్లలకు చట్టాలపట్ల నేటి సమాజంలో జరిగే అంశాలపై కూలంకుషంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.ప్రవీణ్‌రాజు, సెక్రెటరీ గణపురం రామకృష్ణ, సీడబ్ల్యూసీ చైర్మన్ నాగవాణి, ఎస్సై జగదీష్, ఏసీడీపీవో ఇందిరమ్మ, న్యాయవాదులు వెంకన్న, కుమార్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి సరిత

నైతిక విలువలతో కూడిన విద్యనందించాలి : ఎంపీపీ

పెద్దవంగర, జూన్ 12 : విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యనందించాలని ఎంపీపీ ఎర్ర సబిత వెంకన్న అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన పనులను ఎంపీడీవో వేణుమాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులు ముఖ్యంగా విద్యాభాస్యంతో పాటు జీవిత విలువను తెలుసుకోవాలని, వాటికి అనుగుణంగా సమాజంలో నడవడికతో ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన సదుపాయాలను కల్పిస్తూ కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన విద్యను అందిస్తున్నదన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులందరూ బాగా చదివి తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్నివసతులను కల్పించాలని కోరారు. అలాగే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందజేశారు. ఎంపీవో సత్యనారాయణ, హెచ్‌ఎంలు బుధరపు శ్రీనివాస్, సత్యనారాయణ, ఉపాధ్యాయులు రాజలింగం, సదయ్య, ఆంజయ్య, గౌరిశంకర్, వెంకన్న, శ్రీధర్, రవి, కుమార్, సీఆర్పీ నిరంజన్ పాల్గొన్నారు.

'భద్రతా చర్యలు పాటించాలి'

కేసముద్రం, జూన్ 12 : విద్యుత్ వినియోగదారులు భద్రతాచర్యలను పాటించాలని డివిజనల్ ఇంజనీర్ పి.విజయ్ సూచించారు. కేసముద్రం మండలం కాట్రపల్లిలో బుధవారం వినియోగదారుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహవిద్యుత్ వినియోగదారులు తమ ఇళ్లలో ఎర్తింగ్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్‌షాక్‌లను నివారించవచ్చని సూచించారు. సదస్సులో ఆయన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించారు. ప్రమాదభరితంగా ఉన్న ప్రాంతంలో నాలుగు స్తంభాలను వేయించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుగులోత్ సునీతదస్రునాయక్, సూరయ్య, రవీందర్, యాకాంబ్రం, ఏఈ రాజు, ఉపేందర్, ఐలేశ్వర్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ స్కూల్లో నేరుగా అడ్మిషన్లు

కేసముద్రం, జూన్ 12 : మండలంలోని కల్వల మోడల్ స్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో నేరుగా ఆఫ్‌లైన్ అడ్మిషన్లు స్వీకరిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శాంతికిరణ్ బుధవారం తెలిపారు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని వివరించారు. బాలికలకు ప్రత్యేకంగా వసతి గృహం సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు నేరుగా తమ ధ్రువీకరణపత్రాలను తీసుకొని కళాశాలలో సంప్రదించాలని కోరారు.

ఉత్తమ విద్యార్థిని నిఖితను సన్మానించిన కాళోజీ వాకర్స్

మహబూబాబాద్ టౌన్, జూన్ 12 : మానుకోట పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పదవ తరగతిలో 10/10 మార్కులు సాధించిన లావణ్య నిఖితను ఘనంగా సన్మానించారు. మహబూబాబాద్ జిల్లాలోని మొత్తం 102 ప్రభుత్వ పాఠశాలల్లోని 3 వేల మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా, అందులో 10 జీపీఏ మార్కులు సాధించిన ఈదులపూసపల్లి జడ్పీహెచ్ఎస్ ఏకైక విద్యార్థినీ లావణ్య నిఖితను శాలువాలతో సత్కరించి మెమెంటోలు, సావిత్రిభాయిపూలే జీవిత చరిత్ర పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ముఖ్య సలహాదారులు మైన శ్రీనివాస్ మాట్లాడుతూ చదువుకు పేదరికం, కులం, మతం అడ్డుకాదని నిఖిత నిరూపించిందని చెప్పారు. మున్ముందు మరిన్ని విజయాలతో సివిల్స్ సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు నామిరెడ్డి వెంకటరెడ్డి, సోమ విష్ణువర్ధన్, పట్టాభి లక్ష్మయ్య మద్దెర్ల రాజన్న, పూజారి వెంకటేశ్వర్లు, జగదీష్, వెంకటేశ్వర్లు, భద్రు, శ్రీహరి, రవీందర్, యాకయ్య, రవి, మధూసూదన్‌రెడ్డి, వెంకట్, కుర్ర మహేష్, ఉపేందర్, ప్రభాకర్, శ్రీను, విద్యాసాగర్ పాల్గొన్నారు.

'దరఖాస్తు చేసుకోవాలి'

తొర్రూరు, జూన్ 12 : కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన ప్రజా పాలనకు అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సిలార్ సాహెబ్ అన్నారు. బుధవారం తొర్రూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించి ఆయన మాట్లాడుతూ ప్రజలు నూతన రేషన్ కార్డులు, గృహజ్యోతి, రూ.500కు గ్యాస్ తదితర సంక్షేమ పథకాలకు గతంలో దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందని అర్హులైన వారు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పట్టణ ప్రజలు మునిసిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

ఉత్సాహంగా బడులు పునఃప్రారంభం

(7వ పేజీ తరువాయి)

బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జిల్లాలోని గ్రామాలు, గిరిజన తండాల్లో ముందస్తుగానే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని బ్యానర్లతో బడిబాటలో భాగంగా ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. బుధవారం పాఠశాలలు ప్రారంభమైనపట్టికి తొలిరోజు విద్యార్థులు పాఠశాలలకు నామమాత్రంగానే హాజరయ్యారు.


బడిగంట కొడుతున్న అటెండర్


కుండలో మధ్యాహ్న భోజన వంటను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం జ్యోతి

నకిలీ విత్తనాల నియంత్రణలో విఫలం

మహబూబాబాద్ రూరల్, జూన్ 12 : నకిలీ విత్తనాలు అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని ప్రగతిశీల అఖిలభారత రైతుసంఘం (ఏఐపీకేఎస్) రాష్ట్ర సహాయ కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న అన్నారు. మహబూబాబాద్ కలెక్టరేట్ ఎదుట బుధవారం ఆందోళన చేపట్టి అనంతరం అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా చంద్రన్న మాట్లాడుతూ.. రైతాంగానికి నాణ్యమైన విత్తనాలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదని చెప్పారు. టన్నుల కొద్ది నకిలీ విత్తనాలు బయటపడ్డ, పుట్టగొడుగల్లా పుట్టుకువస్తున్న విత్తన కంపెనీలను నియంత్రించడం లేదన్నారు. నాణ్యమైన విత్తనాలకు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్న డీలర్లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జగ్గన్న, కొత్తపల్లి రవి, ముంజంపల్లి వీరన్న, బిల్లకంటి సూర్యం, బండపల్లి వెంకటేశ్వర్లు, ఉమగాని సత్యం, భాస్కర్‌రెడ్డి, పైండ్ల యాకయ్య, పాపారావు, రంగయ్య, అనిల్, రాజు, కొమురయ్య, వెంకన్న, సైదులు, బిక్షం, మౌలాన, వీరన్న పాల్గొన్నారు.

58 కిలోల గంజాయి పట్టివేత

● పోలీసుల అదుపులో ఒరిస్సా మహిళ

గార్ల, జూన్ 12 : మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న మహిళ వద్ద 58 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై జీనత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం. ఒరిస్సాకు చెందిన లల్లి మూడు సూటుకేసుల్లో గంజాయిని నింపుకొని గార్ల రైల్వే స్టేషన్‌లో భద్రపరిచి, అనుమానాస్పదంగా బయట తిరుగుతుంటే ఈ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు గమనించి ఆ మహిళను పట్టుకొని విచారించగా గంజాయి వివరాలు తెలుసుకున్నారు. సమీపంలో దాచివున్న మూడు సూటుకేసులను స్వాధీనం చేసుకొని పకడబ్బందీగా ప్యాకింగ్ చేసిన గంజాయి స్టేషన్‌కు తరలించి లల్లిని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ అదుపు తప్పి ముగ్గురికి తీవ్ర గాయాలు

కేసముద్రం, జూన్ 12 : కేసముద్రం మండలం బేరువాడ శివారు బోడ మంచ్యాతండా సమీపంలోని రైస్ మిల్లు మూలమలుపు వద్ద బుధవారం బైక్ అదుపుతప్పి ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. కేసముద్రం నుంచి మహబూబాబాద్ వైపునకు బీహార్‌కు చెందిన అమిత్‌కుమార్, బిట్టుకుమార్, సంజయ్‌కుమార్‌లు బైక్‌పై వెళుతున్నారు. రైస్‌మిల్లు వద్దనున్న మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లి పడిపోయింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను తోటి కార్మికులు మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన కార్మికులు ఇదే ప్రాంతంలో నిర్మాణ రంగంలో రాడ్‌బైండింగ్ పని చేస్తున్నట్లు తెలిసింది.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఆటో..

● ఒకరికి తీవ్ర గాయాలు

మహబూబాబాద్ రూరల్, జూన్ 12 : జిల్లా కేంద్రం శివారు ఈదులపూసపల్లిలో ఓ ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొట్టిన ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. ఈదులపూసపల్లికి చెందిన బోడ రమణ తన ద్విచక్రవాహనంపై నెక్కొండకు వెళ్తున్నాడు. కేసముద్రం నుంచి మహబూబాబాద్‌కు ట్రాలీ ఆటో వేగంగా వచ్చి ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో రమణకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అతన్ని చికిత్స నిమిత్తం 108 ద్వారా జిల్లా ఆస్పత్రికితరలించారు.

చంద్రబాబు ప్రమాణస్వీకారానికి తరలివెళ్లిన ముల్కలపల్లి నాయకులు

డోర్నకల్, జూన్ 12 : గన్నవరంలో కేసరపల్లి వద్ద ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారోత్సవానికి బుధవారం డోర్నకల్ మండలం నుంచి కార్యకర్తలు, టీడీపీ పార్టీ కార్యకర్తలు తరలివెళ్లారు. ముల్కలపల్లి గ్రామానికి చెందిన 30 మందికి పైగా యువకులు ప్రత్యేక వాహనంలో చంద్రబాబు ప్రమాణస్వీకారోత్సవానికి తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో కందుల మల్లికార్జున్, దేవరపల్లి నాగేశ్వర్‌రావు, నంజాల సురేందర్, చాగర్లముడి శ్రీనివాస్, సామినేని సతీష్, తుళ్లూరు శోభన్‌బాబు,ఉపేందర్, నాగేశ్వర్‌రావు, లక్ష్మణ్, రమేష్‌తో పాటు టీడీపీ పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● డిప్యూటీ డీఎంహెచ్‌వో అంబరీష

చిన్నగూడూరు, జూన్ 12 : అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్వో అంబరీష హెచ్చరించారు. బుధవారం ఉగ్గంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జయ్యారం, మన్నెగూడెం ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను సందర్శించి, పలు రికార్డులను పరిశీలించారు. మన్నెగూడెం ఆశా కార్యకర్త, ఏఎన్‌ఎంలపై గ్రామానికి చెందిన మమత సాయికుమార్ ఇచ్చిన ఫిర్యాదును బుధవారం ఆ గ్రామస్థుల సమక్షంలో విచారణ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆశాకార్యకర్త, ఎన్ఎంలు విధులపట్ల నిర్లక్ష్యం చేయకుండా సమయపాలన పాటించి సక్రమంగా తమ బాధ్యతలను నిర్వర్తించాలని, లేనిఎడల శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామస్థులు అధికారులకు సహకరించాలని అన్నారు. సీజనల్ వ్యాధులను నివారించేందుకు డ్రైడే నిర్వహించి, అవగాహన కల్పించాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కృష్ణార్జునరావు, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, డీపీహెచ్ఎన్వో మంగమ్మ, రాధ ఉన్నారు.

గొర్రెల కాపరుల డీడీ సొమ్ములు తిరిగివ్వాలి

గార్ల, జూన్ 12 : గత ఆరు నెలల క్రితం సబ్సిడీ గొర్రెల కోసం డీడీలు తీసిన రైతులకు ప్రభుత్వం తక్షణమే ప్రభుత్వ వాటిని వాపస్ ఇవ్వాలని తెలంగాణ యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు సూత్రపు రాజుయాదవ్ కోరారు. గొర్రెల కాపరులు చెల్లించిన డీడీలను వాపస్ ఇవ్వాలని కోరుతూ జిల్లాపశుసంవర్ధశాఖ అధికారి సుధాకర్‌కు వినతిపత్రం అందించారు. పెద్దబోయిన రవియాదవ్, మధుయాదవ్, రాజేష్‌యాదవ్, గుమాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు మొక్కలను నాటాలి

● దేవాదాయ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ కవిత


శ్రీముసలమ్మ జాతరలో మొక్కను నాటుతున్న కవిత

కొత్తగూడ, జూన్ 12 : ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని దేవాదాయ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ కవిత సూచించారు. కొత్తగూడ, మండలం గుంజేడులోని శ్రీముసలమ్మ జాతర ప్రాంగణంలో దేవాదాయ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ కవిత మొక్కను నాటారు. ఈవో భిక్షమాచారి, పూజారులు తోలెం చిన్ననర్సయ్య, తోలెం వెంకటేశ్వర్లు, కిరణ్, వెంకన్న, నవీన్, అనంతరావు, సిబ్బంది వెంకటరెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.


పెద్ద చెరువుకు మరమ్మతులు చేపడతాం

● ఐబీ ఈఈ నారాయణ ● 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

కొత్తగూడ, జూన్ 12 :వేలుబెల్లి పెద్ద చెరువు కట్ట, తూము, కాలువలను మరమ్మత్తు చేస్తామని ఐబీ ఈఈ నారాయణ పేర్కొన్నారు. వేలుబెల్లి చెరువును నారాయణ పరిశీలించారు. చెరువుకు మరమ్మత్తు పనులు చేసి నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ వజ్జ వెంకటలక్ష్మి సురేందర్ ఈఈ నారాయణను కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మరమ్మత్తు పనులకు ప్రతిపాదనలు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. అనుమతులు రాగానే మరమ్మత్తు పనులు చేపడుతామని పేర్కొన్నారు.

రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలి

● తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న



ఎస్బీఐ బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తున్న రైతు సంఘం నేతలు

మహబూబాబాద్ టౌన్, జూన్ 12 : రైతులకు గతంలో ఇచ్చిన పాతరుణాలు మాఫీ చేసి కొత్తరుణాలు అందించాలని తెలంగాన రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గునిగంటి రాజన్న విజ్ఞప్తి చేశారు. సదరు డిమాండ్‌తో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఇండియన్, ఎస్బీఐ బ్యాంకుల ఎదుట తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...వ్యవసాయ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో పాత రుణాలను మాఫీ చేసి కొత్తగా పంట రుణాలు అందించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ. 2లక్షల రుణ మాఫీ చేస్తామని ఇచ్చిన హామిని నెరవేర్చాలన్నారు. నకిలీ విత్తనాలు , పురుగుమందులతో అన్నదాతలు తీవ్రంగా నష్ట పోతున్నారని వాటిని అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నల్లపు సుధాకర్, ఇస్లావత్ జోగియానాయక్, గాడిపెల్లి వెంకన్న, సోమారపు ఎల్లయ్య, బద్రీనాథ్, బోనగిరి దేవేందర్, లక్ష్మయ్య, రాంమూర్తి పాల్గొన్నారు.


కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న జర్నలిస్టులు

ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత విద్యను అందించాలి

● కలెక్టర్‌కు జర్నలిస్టుల విజ్ఞప్తి

మహబూబాబాద్ టౌన్, జూన్ 12 : జిల్లాలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్యను అందించాలని తెలంగాణ మాల జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షుడు చందా శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు బుధవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అనేక జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య అవకాశం కల్పిస్తున్నారని అదే తరహాలో జిల్లాలో అమలయ్యేలా చూడాలని కోరారు జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ స్థాయిలో ఉచిత విద్య అందేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జీవోను తీసుకురావాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఈవో రామారావు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి బేతమల్ల సహదేవ్, బొడ్డు అశోక్, కొప్పుల శ్రీనివాస్,రోశయ్య, నాగేశ్వర్‌రావు, కార్తీక్ పాల్గొన్నారు.

పరిశుభ్రతను పాటించాలి

మహబూబాబాద్ టౌన్, జూన్12 : గ్రామీణ వైద్యులు తమతమ గ్రామాల్లో ఫస్ట్ ఎయిడ్ సెంటర్లలో పరిశుభ్రత పాటించి ప్రాథమిక వైద్య సేవలు మాత్రమే చేయాలని గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి. రవీంద్రాచారి సూచించారు. మహబూబాబాద్ పట్టణంలో గ్రామీణ వైద్యుల సంఘం సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రాచారి మాట్లాడుతూ గ్రామీణ వైద్యులంతా ఐక్యంగా ఉండి ప్రభుత్వ గుర్తింపు కోసం పాటు పడాలన్నారు. నియమ నిబంధనలు పాటిస్తూ వైద్యం చేయాలని పరిధి దాటి వైద్యం చేసి ఇబ్బందులు పడవద్దని సూచించారు.

రాధక్క ఆశయాలను కొనసాగిద్దాం

● ఎన్డీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య

మహబూబాబాద్ రూరల్, జూన్ 12 : గోదావరి లోయ ప్రతిఘటన పోరాట యోధురాలు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకురాలు రాధక్క ఆశయాలను కొనసాగిద్దామని ఎన్డీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటం వద్ద బుధవారం నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ... చంద్రపుల్లారెడ్డి జీవిత సహచరి రాధక్క అనారోగ్యంతో మృతి చెందడం బాధకరమన్నారు. 1970 ప్రాంతంలో అడవిబాట పట్టి అనేక పోరాటాలు, ఉద్యమాలు చేపట్టినట్లు చెప్పారు. ఆమె మృతి పార్టీకి తీరని లోటు అని అన్నారు. ఈ సమావేశంలో జడ సత్యనారాయణ, గుజ్జు దేవేందర్, శివ్వారపు శ్రీధర్, శ్రీశైలం, లింగన్న, నర్సమ్మ, భట్టు చైతన్య, రాకేష్, చారీ హరీష్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

నెల్లికుదురు, జూన్ 12 : విద్యుదాఘాతంతో ఆవు మృతిచెందిన సంఘటన మునిగలవీడు శివారు జయరాం తండాలో బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం. జేత్రాంనాయక్ చెందిన ఆవు మేతకు వెళ్లింది. వ్యవసాయ భూముల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తీగలకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు మృతిచెందంతో రూ.50 వేల నష్టం జరిగిందని బాధితరైతు జేత్రాంనాయక్ ఆవేదన వ్యక్తం చేశాడు.


మృతి చెందిన ఆవు